




# DD9 వార్త

తెలుగు దినపత్రిక


## బషీరాబాద్‌లో ప్లాస్టిక్ నిర్మూలనపై విస్తృత ప్రచారం



03

సంపుటి : 02 సంచిక : 243 హైదరాబాద్, ఏప్రిల్, గురువారం 23, 2026 పేజీలు : 05 వెల : 3.00

# హైకోర్టులో కేసీఆర్, హరీశ్‌రావులకు ఊరట



కాళేశ్వరం కమిషన్ పై కీలక తీర్పు
ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలకు స్టే
విచారణలో నిబంధనలు పాటించలేదన్న కోర్టు
జీవో 6ను సవాలు చేస్తూ పలువురు నేతల పిటిషన్లు
వాదనలు వినకుండా అభియోగాలు మోపారన్న పిటిషనర్లు
ప్రజాప్రయోజనాల కోసం కమిషన్ ఏర్పాటన్న ప్రభుత్వం
కాళేశ్వరం వ్యవహారంపై సీబీఐ విచారణకు రాష్ట్ర విజ్ఞప్తి
హైకోర్టు తీర్పుపై రాజకీయ పార్టీల ప్రతిస్పందనలు
బీఆర్ఎస్ శ్రేణుల్లో సంబరాలు, కాంగ్రెస్‌పై విమర్శలు

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణలో అవకతవకల ఆరోపణలపై నియమించిన కమిషన్‌కు సంబంధించిన వివాదంలో తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను ఆధారంగా తీసుకుని పిటిషనర్లపై ఎలాంటి చర్యలు చేపట్టవద్దని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులకు తాత్కాలిక ఊరట లభించింది. కమిషన్ నివేదిక చుట్టూ నెలకొన్న వివాదానికి ఈ తీర్పు కీలక మలుపుగా భావిస్తున్నారు. హైకోర్టు ధర్మాసనం విచారణ సందర్భంగా కమిషన్ విధానంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. విచారణలో అవసరమైన న్యాయపరమైన ప్రమాణాలు పాటించలేదని అభిప్రాయపడింది. కమిషన్ నివేదికలో వ్యక్తులపై సూచనలు చేయాలంటే వారి వాదనలు పూర్తిగా వినాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఈ ప్రాథమిక నిబంధనలను పాటించకుండా నివేదిక సమర్పించడం సరైన విధానం కాదని వ్యాఖ్యానించింది.
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన బ్యారేజీల నిర్మాణాల్లో అవకతవకల ఆరోపణల నేపథ్యంలో ..మిగతా 2లో

# ఆర్టీసీ సమ్మె.. జనం ఇక్కట్లు

రాష్ట్రవ్యాప్తంగా నిలిచిన బస్సులు
ఐఏఎస్ కమిటీతో చర్చలు విఫలం
32 డిమాండ్ల సాధనకై కార్మికుల పట్టుదల
డిపోల ముందు కార్మికుల ఆందోళనలు
రాష్ట్రవ్యాప్తంగా పోలీసుల బందోబస్తు
పలు జిల్లాల్లో రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం
ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో అధికారుల ప్రయత్నాలు
ప్రయాణికుల ప్రైవేట్ రవాణా చార్జీల పెంపు
సమ్మె కొనసాగిస్తామంటూ జేఏసీ స్పష్టత



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల సమ్మె బుధవారం ఉదయం నుంచి ప్రారంభమై రాష్ట్రవ్యాప్తంగా రవాణా వ్యవస్థను ప్రభావితం చేసింది. మంగళవారం సచివాలయంలో ఐఏఎస్ అధికారుల కమిటీతో జరిగిన చర్చలు ఫలించకపోవడంతో కార్మిక సంఘాలు సమ్మెకు దిగాయి. అర్ధరాత్రి నుంచే డ్యూటీలకు హాజరు కాకుండా బస్సులను డిపోలకే పరిమితం చేసి నిరసనలు ప్రారంభించాయి. తమ 32 డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. సచివాలయంలో జరిగిన చర్చలు సుమారు మూడు గంటలపాటు కొనసాగాయి. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ నేతృత్వంలోని కమిటీ కార్మిక సంఘాల ప్రతినిధులతో విస్తృతంగా చర్చలు జరిపింది. ఉద్యోగుల సమస్యలు, ఆర్థిక అంశాలు, సేవా నిబంధనలపై వివరాలు సేకరించింది. ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి సానుకూలంగా ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితుల కారణంగా కొంత సమయం అవసరమని కమిటీ అభిప్రాయం వ్యక్తం చేసింది. నాలుగు వారాల గడువు ఇవ్వాలని విజ్ఞప్తి చేసినా జేఏసీ నాయకులు అంగీకరించలేదు. తమ డిమాండ్లపై స్పష్టమైన హామీ లేకపోవడంతో చర్చలు విఫలమయ్యాయి. సమ్మె ప్రారంభంతో రాష్ట్రవ్యాప్తంగా వేలాది బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. హైదరాబాద్‌తో పాటు పలు నగరాలు, పట్టణాల్లో బస్టాండ్లు ఖాళీగా మారాయి. ప్రయాణికులు బస్సుల కోసం ఎదురుచూస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు ప్రాంతాల్లో డిపోల ముందర ..మిగతా 2లో



## బీజేపీ బీఆర్ఎస్ మధ్య రహస్య ఒప్పందం

కాళేశ్వరంపై హైకోర్టు తీర్పు సాంకేతికపరమైన అంశాలకే పరిమితమన్న మహేశ్ గౌడ్
కాళేశ్వరంలో భారీ అవినీతి జరిగిందన్నది జగమెరిగిన సత్యమని వ్యాఖ్య
బాధ్యులైన వారు ఎప్పటికైనా శిక్ష అనుభవించాల్సిందేనన్న పీసీసీ అధ్యక్షుడు

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై తెలంగాణ హైకోర్టు తాత్కాలికంగా స్టే విధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ తీర్పు కేవలం సాంకేతికపరమైన అంశాలకే పరిమితమని, అవినీతి జరగలేదని కోర్టు ఎక్కడా చెప్పలేదని స్పష్టం చేశారు.
కోర్టు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను కానీ, దాని విచారణను కానీ తప్పుబట్టలేదని... కేవలం నివేదిక రూపకల్పనలో అనుసరించిన విధానాన్ని మాత్రమే ప్రశ్నించిందని ఆయన వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిందన్నది జగమెరిగిన సత్యమని, ..మిగతా 2లో

## కుట్రలు కూలాయి.. కాళేశ్వరం గెలిచింది




కక్ష కట్టినట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లర ప్రచారం చేసింది
కుంగింది కాళేశ్వరం కాదు.. కేసీఆర్‌పై చేసిన కుట్రలు
మాపై బురదచల్లారు కానీ.. నిప్పులాంటి నిజం బయటకు వచ్చింది
అబద్ధానికి ఆడంబరం ఎక్కువ.. కానీ, ఆయుష్షు తక్కువ
అబద్ధాలతో అద్భుతమైన నిజాలను చాలా కాలం దాచలేదు. కేటీఆర్

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
కాళేశ్వరం ప్రాజెక్టు విచారణకు సంబంధించి తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పుపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. "నిజం నిలకడ మీద తెలుస్తుంది" అనే నానుడి నేడు నిజమైందని, కాళేశ్వరంపై కాంగ్రెస్ పార్టీ చేసిన దుష్ప్రచారం తప్పని తేలిపోయిందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై , కేంద్రంలోని బిజెపి తీరుపై నిప్పులు చెరిగారు.
కాళేశ్వరం కుంగిపోయిందని రాష్ట్రమంతా తిరిగిన రేవంత్ రెడ్డికి (పిట్టల దొర) హైకోర్టు తీర్పు ఒక చెంపపెట్టు లాంటిదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీని బ్యారేజీ వద్దకు తీసుకువచ్చి ఫొటోలు దిగి, అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టించారని మండిపడ్డారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను తాను మొదటి నుంచీ 'పీసీసీ రిపోర్ట్' అని పిలుస్తున్నానని, నేడు కోర్టు తీర్పుతో ..మిగతా 2లో

## కాంగ్రెస్ రాజకీయ కుట్రలు బట్టబయలు..

ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు వద్దని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
కేసీఆర్, హరీశ్ రావులకు తెలంగాణ హైకోర్టులో ఊరట
ఇది కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలను బట్టబయలు చేసిందన్న హరీశ్ రావు
కక్షసాధింపులు మాని రైతుల ప్రయోజనాలు కాపాడాలని ప్రభుత్వానికి హరీశ్ సూచన



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
కాలేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి టి. హరీశ్ రావులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ తీర్పు కాంగ్రెస్ పార్టీ రాజకీయ కుట్రలను బట్టబయలు చేసిందని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. "ఎన్ని కుట్రలు పన్నినా చివరకు న్యాయస్థానాల్లో న్యాయమే గెలుస్తుందని, సత్యమే నిలుస్తుందని మరోసారి రుజువైంది" అని ఆయన అన్నారు.
కేసీఆర్, హరీశ్ రావుతో పాటు పలువురు మాజీ అధికారులు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. విచారణ కమిషన్ చట్టంలోని ..మిగతా 2లో

## ఆర్టీసీ కార్మికులు సమ్మె విరమించండి

29 డిమాండ్లు పరిష్కరిస్తాం
మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ
కార్మికుల డిమాండ్లపై సానుకూల స్పందన
నాలుగు వారాల్లో కమిటీ నివేదిక
పెండింగ్ బకాయిలన్నీ చెల్లించిన ప్రభుత్వం
విలీనం, ఎన్నికలపై సాంకేతిక చర్చలు
మహాలక్ష్మి పథకంతో పెరిగిన బాధ్యత
భారీగా కొత్త నియామకాలు, కారుణ్య నియామకాలు
పేదల ప్రయాణాలకు ఆటంకం కలిగించొద్దన్న మంత్రి



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో నెలకొన్న సమ్మె పరిస్థితులపై రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటన చేశారు. ఆర్టీసీ కార్మికులు లేవనెత్తిన 32 ప్రధాన అంశాల్లో 29 అంశాల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వాటిపై ఎలాంటి ..మిగతా 2లో

## పెద్దల చదువుకు పెద్ద పీట..

వయోజనుల్లో అక్షరాస్యత పెంపుపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో విద్యా రంగంలో వేగంగా సంస్కరణలు
విద్యా రంగంలో తెలంగాణ దూకుడు
సీఎం రేవంత్ నేతృత్వంలో విద్యా రంగంలో వేగంగా సంస్కరణలు



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
మారుతున్న కాలానికి తగినట్లు మారితేనే మనుగడ సాధ్యమవుతుంది.. ఈక్రమంలోనే విద్యా రంగంలోనూ పలు సంస్కరణలకు ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా శాఖను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. పిల్లలంతా బడుల్లో ఉండడమే కాదు పెద్దలు సైతం అక్షరాలు నేర్చుకోవాలని... ఆధునిక కాలపు అవసరాలకు తగినట్లు తమను తాము మల్చుకోవాలనేది రాష్ట్ర ప్రభుత్వం యోచన. అందుకే వయోజన అక్షరాస్యత పెంపునపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనపర్చుతోంది. అదే సమయంలో పాఠశాల విద్యా ..మిగతా 2లో

# హైకోర్టులో కేసీఆర్, హరీశ్‌రావులకు ఊరట

మొదటిపేజీ తరువాయి

ఈ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. 2024 మార్చి 14న జారీ చేసిన జీవో 6 ద్వారా కమిషన్‌ను అధికారికంగా నియమించారు. అనంతరం పలువురు అధికారులను, సంబంధిత వ్యక్తులను విచారణకు పిలిపించి వాంగ్మూలాలు సేకరించి నివేదిక రూపొందించారు. ఆ నివేదికను ప్రభుత్వం స్వీకరించి తదుపరి చర్యలపై ఆలోచన ప్రారంభించింది.ఈ నేపథ్యంలో కమిషన్ చట్టబద్ధతను సవాలు చేస్తూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఐఏఎస్ అధికారులు ఎస్‌కే జోషి, స్మితా సభర్వాల్ వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. కమిషన్ విచారణలో తమ వాదనలు పరిగణలోకి తీసుకోలేదని, అభియోగాలు మోపే ముందు సరైన అవకాశాలు ఇవ్వలేదని వారు వాదించారు. ఇది సహజ న్యాయం సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు.

పిటిషనర్ల వాదనలను పరిశీలించిన కోర్టు ఈ అంశంపై సుదీర్ఘంగా విచారణ చేపట్టింది. ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం వాదనలు పూర్తిగా విన్న తర్వాత తీర్పును రిజర్వు చేసింది. అనంతరం నిర్ణీత తేదీకి ప్రకటించాల్సిన తీర్పు కొన్ని కారణాలతో వాయిదా పడగా, చివరకు బుధవారం వెలువడింది. ఈ తీర్పులో కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.మరోవైపు ప్రభుత్వం తరపు న్యాయవాదులు కమిషన్ ఏర్పాటు ప్రజాప్రయోజనాల కోసమేనని కోర్టుకు వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు దేశంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకాలలో ఒకటిగా నిలుస్తుందని, అందులో చోటుచేసుకున్న అవకతవకలపై నిజానిజాలు వెలికితీయడం అవసరమని తెలిపారు. ప్రజా నిధుల వినియోగంపై పారదర్శకత కోసం కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు వాదించారు.

ఇక ఈ వ్యవహారం సీబీఐ దర్యాప్తు దశకు చేరుకుంది. బ్యారేజీల నిర్మాణాల్లో అవకతవకలు, నిధుల దుర్వినియోగంపై సీబీఐ విచారణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఇప్పటికే ఈ విషయమై కేంద్ర దర్యాప్తు సంస్థకు లేఖ రాసింది. అయితే రాష్ట్రంలో కేసు నమోదు అయ్యిందా అని సీబీఐ ప్రశ్నించడంతో, తాజాగా మరోసారి లేఖ ద్వారా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని విజ్ఞప్తి చేసింది.ఈ పరిణామాల మధ్య హైకోర్టు తీర్పు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. తీర్పును బీఆర్ఎస్ నాయకులు స్వాగతించారు. ఈ నిర్ణయం తమపై చేసిన ఆరోపణలు నిరాధారమని రుజువు చేస్తోందని పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కమిషన్‌ను ఉపయోగించారని విమర్శలు చేశారు. ప్రభుత్వ విధానాలపై కూడా తీవ్రంగా స్పందించారు.

మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ హైకోర్టు తీర్పు కీలక మలుపు అని వ్యాఖ్యానించారు. కమిషన్ నివేదిక చట్టబద్ధతపై సందేహాలు ఉన్నాయని, కోర్టు వాటిని స్పష్టం చేసిందన్నారు.



కేసీఆర్‌పై చేసిన ఆరోపణలకు సంబంధించి ప్రత్యర్థి పార్టీలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అభివృద్ధికి సంబంధించిన అంశాలను పక్కనపెట్టి రాజకీయ విమర్శలు చేయడం సరికాదన్నారు.ఇక తీర్పు వెలువడిన వెంటనే బీఆర్ఎస్ శ్రేణులు తెలంగాణ భవన్ వద్ద సంబరాలు జరిపాయి. బాణసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశాయి. ఈ తీర్పు తమకు న్యాయం చేసినట్లు భావిస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీపై విమర్శలు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.


కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్రానికి కీలకమైన నీటిపారుదల ప్రాజెక్టుగా నిలిచింది. వ్యవసాయం, నీటి వనరుల వినియోగంలో దీని పాత్ర విశేషంగా ఉంది. ఈ ప్రాజెక్టు చుట్టూ నెలకొన్న వివాదాలు, రాజకీయ ఆరోపణలు, విచారణలు రాష్ట్ర రాజకీయాల్లో కీలక అంశంగా మారాయి. హైకోర్టు తాజా తీర్పు ఈ వివాదానికి తాత్కాలికంగా ముగింపు పలికినప్పటికీ, భవిష్యత్తులో మరిన్ని పరిణామాలు చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది.హైకోర్టు తీర్పు కాళేశ్వరం వ్యవహారంలో కీలక దశగా నిలిచింది. కమిషన్ విధానంపై ప్రశ్నలు లేవనెత్తుతూ న్యాయపరమైన ప్రమాణాల ప్రాముఖ్యతను మరోసారి గుర్తు చేసింది. ఇకపై ఈ కేసు దిశ ఎలా మలుపుతీసుకుంటుందో అన్న దానిపై అందరి దృష్టి నెలకొంది.

## కాంగ్రెస్ రాజకీయ కుట్రలు బట్టబయలు..

మొదటిపేజీ తరువాయి

నిబంధనలను ఘోష్ కమిషన్ పాటించలేదని ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రాథమిక హక్కులు, సహజ న్యాయ సూత్రాలను విస్మరించి జరిపిన విచారణను హైకోర్టు కొట్టివేసిందని హరీశ్ రావు తెలిపారు.

వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించేలా కమిషన్ చేసిన వ్యాఖ్యలు చెల్లవని, ఆ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోరాదని కోర్టు స్పష్టంగా చెప్పిందని ఆయన వివరించారు. ఈ తీర్పుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాటకాలు బట్టబయలయ్యాయని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రాజకీయ బురదజల్లుడు ఆపి, దెబ్బతిన్న పిల్లర్ల మరమ్మతులు పూర్తి చేసి రైతుల ప్రయోజనాలను కాపాడాలని హరీశ్ రావు విజ్ఞప్తి చేశారు.



కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణకు కాంగ్రెస్ ప్రభుత్వం 2024 మార్చిలో జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ 2025 జులై 31న ప్రభుత్వానికి నివేదిక సమర్పించి, కేసీఆర్, హరీశ్ రావులను బాధ్యులుగా పేర్కొన్న విషయం తెలిసిందే.

## పెద్దల చదువుకు పెద్ద పీట..

మొదటిపేజీ తరువాయి

రంగంపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

**100 శాతం అక్షరాస్యత...**

**వయోజన విద్యకు ప్రాధాన్యం**

సంపూర్ణ అక్షరాస్య రాష్ట్రంగా తెలంగాణను మార్చాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుతుంది. 45 ఏళ్లు పైబడిన వయసులో అక్షరాస్యత తక్కువగా ఉండటాన్ని ప్రభుత్వం గుర్తించింది. దీంతో చాలా కాలంగా నిర్లక్ష్యానికి గురైన వయోజనుల విద్యపై ప్రత్యేక దృష్టి సారించింది. ఎక్కడికక్కడ వయోజన విద్య తరగతులు నిర్వహించారు. దీంతో 2025-26 సంవత్సరంలో 6.31 లక్షల మంది పెద్దలు అక్షరాస్యత పరీక్షలకు హాజరయ్యారు. గత ప్రభుత్వం హయాంలో, ముఖ్యంగా 2019 నుంచి 2024 వరకు వయోజన విద్య పెంపు అంశాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. దీంతో ఆ సమయంలో వయోజన విద్య పూర్తిగా కుంటుపడింది. అందుకు విరుద్ధంగా ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వయోజన విద్యపై ప్రత్యేక దృష్టి సారించింది. ఫలితంగానే వయోజన విద్యలో పెద్ద ఎత్తున పెరుగుదల నమోదైంది.

**పాఠశాలల్లో కొత్త మార్పులు**

తెలంగాణలోని పాఠశాలల్లో విద్యలో నాణ్యత పెంచేందుకు ప్రజా ప్రభుత్వం నూతన విధానాన్ని తీసుకొచ్చింది. అకడమిక్ ప్యానెల్ ఇన్స్పెక్షన్ టీమ్స్ ద్వారా పాఠశాలల్లో బోధన విధానాలను ఉన్నతీకరించింది. ఇది విద్యార్థులకు అత్యాధునిక పద్ధతులలో అభ్యసనలో మెలుకువలు నేర్పించేందుకు ఉపయోగపడింది. ముఖ్యంగా పెద్దపల్లి జిల్లాలో 61 పాఠశాలల్లో ఈ విధానం అమలు చేసి, బోధనలో ఉన్న ఇబ్బందులు, అనుకూలతలను గుర్తించారు. చాలామంది ఉపాధ్యాయులకు మంచి పరిజ్ఞానం ఉన్నప్పటికీ, తరగతుల్లో విద్యార్థుల భాగస్వామ్యం తక్కువగా ఉండడాన్ని ఈ టీమ్స్ గుర్తించాయి. దానిని సరిదిద్ది సమర్థంగా అమలు చేయడంతో మంచి ఫలితాలు తీసుకురావడం సాధ్యమైందని విద్యా శాఖ అధికారులు భావిస్తున్నారు.

**ఆరు నెలల్లోనే మంచి ఫలితాలు**

ప్రజా ప్రభుత్వ చర్యల ఫలితంగా తక్కువ సమయంలోనే పాఠశాల విద్యలో మంచి మార్పులు చోటుచేసుకున్నాయి. బోధన పద్ధతుల్లో వ్యూహాత్మకత 48% నుంచి 68%కు



పెరిగింది. తరగతుల గదుల మెరుగైన నిర్వహణలో 42% నుంచి 65%కు, బోధనాభ్యసన సామగ్రి, వనరుల వినియోగం 35% నుంచి 58%కు పెరిగింది. ఇవన్నీ మంచి ఫలితాలు వచ్చేందుకు కారణమయ్యాయి.

**ప్రాథమిక విద్యపై ప్రత్యేక దృష్టి**

పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు ప్రాథమిక దశలోనే అక్షరాలు రాయడం, అంకెలు నేర్చుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (FLN) పై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. దీంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 202223 విద్యా సంవత్సరం నుంచి 202526 వరకు మంచి ఫలితాలు వచ్చాయి. తెలుగులో 9 శాతం నుంచి 35% శాతం వరకు... ఇంగ్లీష్ లో 4 శాతం, 29% శాతం... ఉర్దూ లో 19 శాతం నుంచి 40% శాతం వరకు అభ్యసన సామర్థ్యాలు పెరిగాయి. భాషతో పాటు అంకెలు నేర్చుకోవడం.. కూడికలు, తీసివేతలు వంటి గణిత ప్రక్రియల్లోనూ 18 శాతం నుంచి 30 శాతం ఫలితాలు అధికంగా వచ్చాయి.

**విద్యకు అత్యధిక నిధుల వినియోగం**

సమగ్ర శిక్షా పథకం కింద వచ్చిన నిధులను వినియోగించడంలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. 2025-26లో 84% నిధులు వినియోగించుకొని రాష్ట్రం దేశంలో మొదటి స్థానంలో ఉంది. ప్రతి రూపాయి విద్య కోసం, విద్యార్థుల కోసం వ్యయం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. విద్యా రంగంలో ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు తెలంగాణను దేశంలో ముందువరుసకి తీసుకెళుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణలు విద్యార్థులు, ఉపాధ్యాయులకు విద్యా వ్యవస్థ ప్రగతికి మరింత దోహదపడుతున్నాయి. విద్యా రంగంలో తెలంగాణ ఆదర్శ రాష్ట్రంగా ముందుకు సాగుతోంది.

## శబరి మాత 28 వ వార్షికోత్సవం సందర్భంగా శివానంద భారతి ఆద్వర్యం లో పల్లకి ఊరేగింపు

**ఆదిలాబాద్, బోథ్ ఏప్రిల్ 22(డిడి9 వార్త):-**

బోథ్ మండలము ధన్నూర్ శబరి మాత ఆలయ 28 వ వార్షికోత్సవం సందర్భంగా శివనంద భారతి స్వామి ఆధ్వర్యంలో అమ్మ వారి పల్లకి ఊరేగింపు, హోమం, అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్బంగా శివనంద భారతి స్వామి మాట్లాడుతూ ఆధ్యాత్మికత తోనే మానవాళికి మనశాంతి అని భక్తి లోనే అసలైన శక్తి ఉందని అన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఆధ్యాత్మికత వైపు అడుగులు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వై .ఇంద్ర రెడ్డి , రాంబత్తుల రాజేశ్వర్, జె.మల్లన్న, బి.దినేష్ రెడ్డి,తొండకూరి.గంగా రెడ్డి, ఆశన్న, రమేష్ అమ్మ వారి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కుట్రలు కూలాయి.. కాళేశ్వరం గెలిచింది

మొదటిపేజీ తరువాయి

అది నిజమని నిరూపితమైందని అన్నారు. రేవంత్ రెడ్డి ఎవరిని తెచ్చి ఏ విధంగా వాదించినా, చివరకు సత్యమే గెలిచిందని, నిప్పులాంటి నిజం బయటకు వచ్చిందని ఆయన పునరుద్ఘాటించారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై లక్ష కోట్ల కుంభకోణం జరిగిందని, ఇది బిఆర్ఎస్‌కు ఏటీఎంలా మారిందని రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రాజెక్టుకు అయిన మొత్తం ఖర్చు 94 వేల కోట్లు అయితే, లక్ష కోట్ల అవినీతి ఎలా సాధ్యమని ఆయన ప్రశ్నించారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోలేదని, రాజకీయ లబ్ధి కోసం వీళ్లే కూల్చారనే విషయం త్వరలోనే బయటపడుతుందని ఆయన జోస్యం చెప్పారు. ప్రాజెక్టులు కట్టడమే నేరమన్నట్లుగా ప్రచారం చేయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ విషయంలో కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచిన బీజేపీని, ప్రధాని మోదీని కేటీఆర్ ప్రశ్నించారు. కాళేశ్వరం విషయంలో ఆఘమేఘాల మీద స్పందించిన ఎన్డీఎస్ఏ (NDSA), మరి ఎస్ఎల్బీసీ (SLBC) కూలినప్పుడు, వట్టెం



పంప్ హౌస్ మునిగిపోయినప్పుడు ఎక్కడకు పోయిందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ మీద ఉన్న వ్యక్తిగత కక్షతో రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదని హితవు పలికారు.

2014 ముందు , కేసీఆర్ పాలన ముగిసే నాటికి పెరిగిన పంట దిగుబడే కాళేశ్వరం ప్రాజెక్టు విజయానికి నిదర్శనమని కేటీఆర్ గుర్తు చేశారు. ఇప్పటికైనా రాజకీయ కక్షలు పక్కన పెట్టి, కాళేశ్వరం నీళ్లను లిఫ్టింగ్ చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అబద్ధపు ప్రచారాలు మాని, పరిపాలనపై దృష్టి పెట్టాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కేటీఆర్ సూచించారు.

## ఆర్టీసీ కార్మికులు సమ్మె విరమించండి

మొదటిపేజీ తరువాయి

వ్యతిరేకత లేదని స్పష్టం చేశారు. ఈ 29 డిమాండ్లు తక్షణమే పరిష్కారమయ్యే సామాన్య అంశాలని, మిగిలిన మూడు అంశాలపై స్పష్టమైన కార్యాచరణ ఉందని వివరించారు. సమ్మె అనేది సమస్యకు పరిష్కారం కాదని, చర్చల ద్వారానే ముందుకు వెళ్లాలని కార్మికులకు, జేఏసీ నేతలకు విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ కార్మికులను తన కుటుంబ సభ్యులుగా భావిస్తానని, సంస్థ మనుగడను, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తక్షణమే సమ్మె విరమించి విధుల్లో చేరాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికే నలుగురు ఉన్నత స్థాయి అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేసిందని, ఈ కమిటీకి నాలుగు వారాల గడువు ఇచ్చామని తెలిపారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నామన్న విమర్శల్లో వాస్తవం లేదని, శాస్త్రీయంగా సమస్యలను పరిష్కరించడానికే ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి మండిపడ్డారు.

గత పదేళ్ల పాలనలో ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొన్న ఇబ్బందులు అందరికీ తెలుసని, కానీ ప్రస్తుత ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేసిందని పొన్నం ప్రభాకర్ గుర్తు చేశారు. 2017 పీఆర్సీ బకాయిలను క్లియర్ చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న డీఏలన్నింటినీ మంజూరు చేశామని వెల్లడించారు. 2013 నుంచి పెండింగ్‌లో ఉన్న బాండ్లను కూడా క్లియర్ చేయడం ద్వారా కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించామన్నారు. పీఎఫ్ బకాయిలు గతంలో రూ. 1205 కోట్లు ఉండగా, ప్రస్తుత ప్రభుత్వం వాటిని రూ. 600 కోట్లకు తగ్గించిందని, అలాగే రూ. 690 కోట్లు ఉన్న సీసీఎస్ బకాయిలను రూ. 300 కోట్లకు పరిమితం చేశామని వివరించారు. ఇవే కాకుండా ప్రతినెలా పీఎఫ్, సీసీఎస్ నిధుల కోసం రూ. 75 కోట్లు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నామని, దీనివల్ల భవిష్యత్తులో బకాయిలు



పేరుకుపోయే ప్రమాదం ఉండదని ధీమా వ్యక్తం చేశారు. ఆర్టీసీని ఆర్థికంగా కోలుకునేలా చేస్తున్న తరుణంలో సమ్మె చేయడం అంటే 'మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు' అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంత ప్రజలకు, పేదలకు ఆర్టీసీయే ఏకైక ఆధారమని మంత్రి అన్నారు. ప్రతిరోజూ ప్రయాణించే 65 లక్షల మందిలో 45 లక్షల మంది మహిళలే ఉన్నారని, విద్యావంతులు, రోగులు, వృద్ధులు ఈ వ్యవస్థపైనే ఆధారపడి ఉన్నారని గుర్తు చేశారు. సామాన్య ప్రజలకు కార్లలో తిరిగే స్తోమత లేదని, సమ్మె వల్ల వారి జీవనోపాధి దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కు నాయకులకు ఉందని, కానీ సాధారణ కార్మికులు మాత్రం విధులకు హాజరై ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. తాను స్వయంగా విద్యార్థి నాయకుడిగా వచ్చిన వాడినని, కార్మికుల కష్టనష్టాలు తనకు బాగా తెలుసని, అందుకే కార్మికులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉన్నప్పుడు మొండిగా సమ్మెకు వెళ్లడం సరికాదని, ప్రజల అసౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

## ఆర్టీసీ సమ్మె.. జనం ఇక్కట్లు

మొదటిపేజీ తరువాయి

కార్మికులు నిరసనలు చేపట్టి నినాదాలు చేశారు. ఆర్టీసీ సేవలు పూర్తిగా నిలిచిపోవడంతో సాధారణ ప్రజల ప్రయాణాలకు అంతరాయం ఏర్పడింది. ఉమ్మడి వరంగల్,ఖమ్మం,నిజామాబాద్,మహబూబ్‌నగర్ వంటి జిల్లాల్లో సమ్మె ప్రభావం ఎక్కువగా కనిపించింది. వందల సంఖ్యలో బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. గోదావరిఖనిలోనే వందల బస్సులు నిలిచిపోయాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో కార్మికులు విధులను బహిష్కరించి డిపో వద్ద శాంతియుత నిరసన చేపట్టారు. వికారాబాద్‌లో కూడా బస్సులు కదలకుండా నిలిచిపోవడంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల కోసం ఎదురుచూడాల్సి వచ్చింది.

సమ్మె నేపథ్యంలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ముఖ్యంగా డిపోలు, బస్టాండ్ల వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించారు. బస్సులకు ఎలాంటి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. పలు ప్రాంతాల్లో నిరసనలు శాంతియుతంగా సాగుతున్నప్పటికీ పరిస్థితిని పర్యవేక్షించేందుకు ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉన్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు తగ్గించేందుకు అధికారులు కొన్ని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టారు. మహబూబ్‌నగర్‌లో పరిమిత సంఖ్యలో విద్యుత్ బస్సులను నడిపే ప్రయత్నం చేశారు. అయితే ఇవి సరిపోకపోవడంతో ఎక్కువ మంది ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సి వచ్చింది. హైదరాబాద్‌లో ఆటోలు, క్యాబ్ సేవల డిమాండ్ ఒక్కసారిగా పెరిగింది. దీంతో చార్జీలు పెరగడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రైల్వే స్టేషన్లు, ముఖ్యంగా చర్లపల్లి ప్రాంతంలో రవాణా సౌకర్యాల కొరత తీవ్రంగా కనిపించింది. బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు ఆటోలు, క్యాబ్ సేవలకు మొగ్గు చూపుతున్నారు. రాపిడో, ఓలా, ఉబర్ వంటి ఆన్‌లైన్ సేవల వినియోగం పెరిగింది. అయినప్పటికీ అధిక చార్జీల కారణంగా సాధారణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.ఇక ఆర్టీసీ జేఏసీ నాయకులు తమ సమ్మెను మరింత ఉధృతం చేసే దిశగా చర్యలు చేపడుతున్నారు. హైదరాబాద్‌లో గన్‌పార్క్ వద్దకు వెళ్లి అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా నిరసనలను విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకునే వరకు సమ్మె కొనసాగుతుందని నాయకులు హెచ్చరించారు.

ప్రస్తుతం సమ్మె కారణంగా రాష్ట్ర రవాణా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. రోజువారీ పనుల కోసం ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. బస్సులు లేకపోవడంతో వైద్య సేవలు, అత్యవసర ప్రయాణాలు కూడా ప్రభావితమవుతున్నాయి.ఆర్టీసీ సమ్మె రాష్ట్రవ్యాప్తంగా ప్రజల జీవన విధానంపై గణనీయ ప్రభావం చూపుతోంది. ప్రభుత్వం, కార్మిక సంఘాల మధ్య చర్చలు మళ్లీ ప్రారంభమవుతాయా లేదా అన్నది కీలకంగా మారింది. సమస్యకు త్వరితగతిన పరిష్కారం దొరికితేనే పరిస్థితి సాధారణ స్థితికి చేరుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అప్పటివరకు సమ్మె ప్రభావం కొనసాగుతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.



## బీజేపీ బీఆర్ఎస్ మధ్య రహస్య ఒప్పందం

మొదటిపేజీ తరువాయి

బాధ్యులైన వారు ఎప్పటికైనా శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారు.

గతంలో ప్రధాని మోదీ, అమిత్ షా వంటి నేతలు కాళేశ్వరంను 'ఏటీఎం'తో పోల్చారని గుర్తు చేస్తూ... కాళేశ్వరం అంశంపై ఇప్పుడు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు సీబీఐ విచారణ ఎందుకు చేయించడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీల మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందం వల్లే ఈ కుంభకోణంపై కేంద్రం మౌనంగా ఉందని ఆయన ఆరోపించారు.






# ఉపాధ్యాయ సేవకు వీడ్కోలు
# 39 ఏళ్ల సేవకు గౌరవ నివాళి

**డిడి 9 వార్త ఆదిలాబాద్ జిల్లా,గుడిహత్నూర్ :**

దాదాపు నాలుగు దశాబ్దాల పాటు విద్యా సేవలో అంకితభావంతో పనిచేసిన ఉపాధ్యాయుడు శ్రీ రవీంద్రాచారి పదవీ విరమణ పొందారు. ఆయన సేవలకు గాను సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

వ్యక్తిగత వివరాలు: ఆదిలాబాద్ జిల్లాలోని బజార్హత్నూర్ గ్రామంలో జన్మించిన రవీంద్రాచారి రాధమ్మ - ఆగయ్య దంపతుల రెండవ సంతానం. కుటుంబంలో అన్న జగదీశ్వర్, తమ్ముడు విజయ్ కుమార్, చెల్లెల్లు జయలక్ష్మి, విజయ గీత ఉన్నారు. భార్య రమాప్రభ . వీరికి ఇద్దరు సంతానం - సాయి హర్షిత్, స్నేహిత. ఇద్దరూ బీటెక్ పూర్తి చేసి టీసీఎస్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా కొనసాగుతున్నారు.

విద్యాభ్యాసం: పదవ తరగతి వరకు బజార్హత్నూర్‌లో చదివిన ఆయన, ఇంటర్మీడియట్‌ను బోథ్‌లో, డిగ్రీని ఆదిలాబాద్‌లో పూర్తి చేశారు. అనంతరం హన్మకొండలోని కాకతీయ విశ్వవిద్యాలయంలో టీటీసీ, బి.ఎడ్ పూర్తి చేసి ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగుపెట్టారు.

**ఉద్యోగ ప్రస్థానం:**
1987 ఫిబ్రవరి 13న మద్దిపడిగ యూపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. ఆ తరువాత వివిధ పాఠశాలల్లో తన సేవలను అందించారు.

**పనిచేసిన పాఠశాలలు:**
UPS మద్దిపడిగ - 1 సంవత్సరం 2 నెలలు
PS బోస్ర, MP బజార్హత్నూర్ - 1 సంవత్సరం 4 నెలలు
UPS సిరికొండ, MP ఇచ్చోడ - 11 నెలలు
PS భూతాయి B - 4 సంవత్సరాలు 1 నెల
UPS దేగాం - 3 సంవత్సరాలు 6 నెలలు
MRP బజార్హత్నూర్ - 5 సంవత్సరాలు 1 నెల
ZPSS తోషం - 6 సంవత్సరాలు 1 నెల
ZPSS ఇచ్చోడ - 8 సంవత్సరాలు 11 నెలలు
ZPSS ఇంద్రవెల్లి - 7 సంవత్సరాలు 9 నెలలు
మొత్తం గా 39 సంవత్సరాలు 2 నెలలు 22 రోజుల పాటు నిరంతర సేవలందించారు.

**సేవా విశేషాలు:**
రవీంద్రాచారి విద్యార్థులలో క్రమశిక్షణ, విలువలు, విజ్ఞానాన్ని పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషించారు. ఆయన బోధన శైలి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా ఉండేది. పాఠశాల అభివృద్ధి కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొన్నారు.

**సన్మాన కార్యక్రమం:**
పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు ఆయన సేవలను కొనియాడారు. ఆయన విద్యా సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.

**ముగింపు:**
విద్యా రంగంలో ఆయన చేసిన సేవలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయని, భవిష్యత్తులో కూడా ఆయన అనుభవం సమాజానికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు.




## సీఎంఆర్ కేసులపై పోలీస్ కమిషనర్ సమీక్ష

- **విచారణ వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం**

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 22(డీడీ9 వార్త):**

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని సీఎంఆర్ కేసుల పురోగతిపై జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య బుధవారం సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో పెండింగ్‌లో ఉన్న ప్రతి కేసును ఆయన విపులంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... సీఎంఆర్ కేసుల దర్యాప్తులో ఎలాంటి జాప్యం జరగకుండా నిర్ణీత గడువులోగా విచారణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సాక్ష్యాధారాల సేకరణలో నాణ్యత పాటించాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వినియోగించుకుని నేరస్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితులకు న్యాయం జరిగేలా పారదర్శకంగా వ్యవహరించాలని, విచారణలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. అధికారులందరూ పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేలా బాధ్యతగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్మూర్ ఏసిపి వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్బిఐ ఇన్స్పెక్టర్ కే.శ్రీధర్ రెడ్డి, ఎన్ఐబి ఇన్స్పెక్టర్ ఎం.అశోక్, సి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ శ్రీ ఆర్.అంజయ్య తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.






## బషీరాబాద్‌లో ప్లాస్టిక్ నిర్మూలనపై విస్తృత ప్రచారం

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 21(డీడీ9 వార్త):**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ గ్రామ పాలకవర్గం ఆధ్వర్యంలో బుధవారం ప్లాస్టిక్ నిర్మూలనపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జమున రమేష్, ఉప సర్పంచ్ భూమేశ్వర్, వార్డు సభ్యులు స్థానిక వారసంతలో పర్యటించి ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలపై వ్యాపారస్తులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాలకవర్గం కీలక ప్రకటన చేసింది. వచ్చే వారసంత నాటికి ప్లాస్టిక్ కవర్లు వాడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, నిబంధనలు ఉల్లంఘించిన వారికి భారీగా జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను విడనాడి, ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులను వాడాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.





## తరుగు పేరుతో రైతుల నిలువు దోపిడీ

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 21(డీడీ9 వార్త):**

భీంగల్ పట్టణంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో దొడ్డు వడ్ల కొనుగోలు ప్రక్రియలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై రైతు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఇస్తున్న మూడు కిలోల తరుగుకు తోడు, అదనంగా మరో రెండు కిలోల తరుగు ఇస్తేనే వడ్లను దించుకుంటామని లేనిపక్షంలో కొనుగోలు చేయబోమని రైస్ మిల్లర్లు, కొనుగోలు ఏజెన్సీలు నిబంధనలు పెట్టడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కష్టాల్లో ఉన్న రైతులకు ఐదు కిలోల తరుగు తీయడం అనేది తీవ్ర అన్యాయమని, ఇది రైతులను ఆర్థికంగా నష్టాల్లోకి నెట్టడమేనని నాయకులు మండిపడ్డారు. ఈ సమస్యపై స్పందించిన రైతు నాయకులు, టిఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు భీంగల్ ఇన్‌ఛార్జ్ ఎమ్మార్వోను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని తరుగు లేకుండా దొడ్డు వడ్లను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించకపోతే, వచ్చే శుక్రవారం లేదా సోమవారం రోజున పట్టణంలో రైతు జేఏసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు బోదిరే నర్సయ్య, కౌన్సిలర్ నీలం రవి, సీనియర్ నాయకులు మూత లింబాద్రి మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికులు శాంతియుత పద్ధతిలో సమ్మె నిర్వహించుకోవాలి

- **ప్రజా శాంతికి విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు : పోలీస్ కమిషనర్**

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 21(డీడీ9 వార్త):**



నిజామాబాద్ జిల్లాలో కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణే తమ ప్రధాన ప్రాధాన్యతని జిల్లా పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య స్పష్టం చేశారు. సమ్మె చేయడం కార్మికుల ప్రజాస్వామ్య హక్కు అయినప్పటికీ, అది చట్టపరిధిలో మరియు శాంతియుత వాతావరణంలోనే జరగాలని ఆయన సూచించారు. సమ్మె కారణంగా సాధారణ ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు మరియు అత్యవసర సేవలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ మరియు రవాణా వ్యవస్థపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. బస్సుల రాకపోకలు సాఫీగా సాగేందుకు డిపోలు, ప్రధాన కూడళ్లు మరియు బస్టాండ్ పరిసరాల్లో అదనపు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఎవరైనా తాత్కాలిక డ్రైవర్లను లేదా విధుల్లో చేరే ఆర్టీసీ సిబ్బందిని బెదిరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, విధుల్లో ఉన్న వారికి పూర్తి స్థాయి భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఉద్దేశపూర్వకంగా అల్లర్లు సృష్టించినా, ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఆస్తులకు నష్టం కలిగించినా, అధికారుల విధులకు ఆటంకం కలిగించినా వారిపై చట్టపరమైన చర్యలతో పాటు ఉద్యోగ పరమైన యాక్షన్ తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఇప్పటికే ఇతర జిల్లాల్లో అల్లర్లకు పాల్పడిన వారిపై సంబంధిత డిపో మేనేజర్లకు తదుపరి చర్యల నిమిత్తం నివేదికలు పంపడం జరిగిందని గుర్తుచేశారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం మరియు వదంతులు వ్యాప్తి చేసే వారిపై కూడా నిరంతర నిఘా ఉంటుందని అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని పేర్కొన్నారు. ప్రజలు ఎక్కడైనా అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని, జిల్లాలో శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసులకు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## నందిగల్లిలో తీరిన తాగునీటి కష్టాలు

**నిజామాబాద్ జిల్లా, ఏప్రిల్ 21(డీడీ9 వార్త):**

భీమ్‌గల్ పట్టణంలోని నందిగల్లి 3వ వార్డులో గత కొంతకాలంగా వేధిస్తున్న తాగునీటి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. వార్డు పరిధిలోని పాత నీటి పైప్‌లైన్ పూర్తిగా దెబ్బతినడంతో నీటి సరఫరా నిలిచిపోయి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన కౌన్సిలర్ తోట సతీష్, వెంటనే స్పందించి మరమ్మతు పనులు చేపట్టారు. ఇందులో భాగంగా పోచమ్మ గుడి నుండి సుమారు 90 మీటర్ల మేర కొత్త పైప్‌లైన్‌ను ఏర్పాటు చేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించారు.

ఈ కొత్త పైప్‌లైన్ అందుబాటులోకి రావడంతో వార్డు ప్రజలకు తాగునీటి సరఫరా మెరుగుపడింది. చాలా రోజులుగా నీటి కోసం ఎదురుచూస్తున్న తమ సమస్యను త్వరితగతిన పరిష్కరించినందుకు వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, కౌన్సిలర్ తోట సతీష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.



# మత్తులో జీవితం చిత్తు

- **చోద్యం చూస్తున్న అధికారులు**
- **విచ్చలవిడిగా బెల్ట్ షాపులు**
- **పేదల ప్రాణాలు హరిస్తున్న సంబంధిత శాఖ పనితీరు కనబడడం లేదు**
- **కాలనీవాసులు ఎన్నిసార్లు కంప్లైంట్ చేసిన పట్టించుకునే నాధుడే లేడు**

**నిజామాబాద్ కోటగిరి ఏప్రిల్ 22 (డిడి9వార్త):**

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో వైన్స్ షాప్ వాళ్ల ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ కాయ కష్టం చేసుకుని కడుపులో అన్నం లేని పరిస్థితుల్లో మద్యం సేవించి స్పృహ కోల్పోయి రోడ్డు మధ్యలో పడిపోయిన వైన్ షాప్ సిబ్బంది పట్టించుకోకపోవడం సమంజసం కాదని వెంటనే పోలీస్ సిబ్బందికి, లేక వైన్ షాప్ సిబ్బంది రోడ్డుపై పడ్డ వ్యక్తిని రోడ్డు కింద వైపున పడుకోబెట్టాలి కానీ మాకేం పట్టినట్టుగా ఆ వ్యక్తిని అలాగే వదిలేస్తే ఇప్పుడు ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో లారీలలో ధాన్యం, ఇసుక రవాణా జరుగుతున్న పెద్ద వాహనాలు ఒకవేళ అదుపుతప్పి దూసుకెళ్తే అతని జీవితానికి,అతని కుటుంబానికి బాధ్యతగా ఎవరుంటారని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో కూడా కాలనీవాసులు ఇదే విషయాన్ని ఎన్నోసార్లు మొరపెట్టుకున్న ఎవరూ పట్టించుకోలేదు ఇక సాయం చేసేది లేదని కొందరు యువకులు ఈ దుశ్చర్యను సంబంధిత శాఖ లేక జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి అవసరమైతే రోడ్డుకు పక్కన వైన్ షాప్ ను తీయడానికి సిద్ధమని వారి అభిప్రాయాన్ని తెలిపారు. ఇప్పటికైనా వైన్ షాప్ యజమానులు చిన్నాచితక తిని తినక తాగుతున్న బీదవారు రోడ్డుపైన పడ్డ కూడా పట్టించుకోకపోవడం ఎవరి తప్పో అర్థం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏది ఏమైనా వైన్ షాప్, బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులలో విధి నిర్వహణ లోపం స్పష్టంగా కనిపిస్తుందని చెప్పుకోవచ్చు. ఇట్టి విషయాన్ని ఈసారి కచ్చితంగా వైన్ షాప్ కదిలే వరకు కలెక్టర్ ఆఫీస్ ముందు కూర్చుంటామని కలెక్టర్ ఇట్టి విషయంపై స్పందించాలన్నారు



## సుంకిని గ్రామంలో ఉచిత టీకాలు పంపిణీ

**నిజామాబాద్ పోతంగల్ ఏప్రిల్ 22(డిడి9వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం లోని సుంకిని గ్రామంలో ఆవు,గేదె జాతి 3 నెలల పైన వయసు గల పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధినిరోధక టీకాల పంపిణీ చేయటం జరిగింది కార్యక్రమం లో పశువులకు టీకాలు ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు హన్మంతు, గ్రామ సర్పంచి షాజీ పటేల్,ఉప సర్పంచ్ కవితా చంద్రకాంత్,పశువైద్యులు డాక్టర్ సురేష్ కుమార్,సిబ్బంది సుధీర్ గౌడ్,అటెండర్లు భూమేష్,సతీశ్, భాస్కర్,గోపాల మిత్ర సాయిలు,గ్రామ పంచాయతీ కార్యదర్శి రాము ఇంకా పశు పెంపకందార్లు పాల్గొన్నారు.



## వృద్ధురాలికి ఆర్థిక సహాయం అందజేసిన ఎంఏ హకీం

**నిజామాబాద్ పోతంగల్ ఏప్రిల్ 22(డిడి9వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలంలోని హంగర్గా ఫారం గ్రామంలో బుధవారం రోజున నిరుపేద వృద్ధురాలు బస్టాండ్ నందు నివసిస్తుండగా ఆ మార్గం గుండా వెళ్తున్న సామాజిక సేవకర్త ఎంఏ హకీం గమనించి ఆమెకు సందర్శించి మాట్లాడి ఆయన వంతు సహకారంగా రెండు బెడ్ షీట్లు బట్టలు రాత్రి పూట దోమలు కుట్టకుండా ఫ్యాన్ ఏర్పాటు చేశారు అన్ని సేవలో మానవ సేవ గొప్పదని ఆయన చెప్పారు తదుపరి కార్యక్రమం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళుల ర్పించారు బుద్ధ మందిరంలో బుద్ధ విగ్రహానికి పువ్వులు సమర్పించి నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో ఎంఏ హకీమ్, శేరు, ఏజజ్ ఖాన్, గ్రామస్తులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు



## పారిశుద్ధ్య కార్మికులకు ఘన సన్మానం

- **బీజేపీ యువ నేత మర్రి పురురవ రెడ్డి**

**సికింద్రాబాద్, ఏప్రిల్ 22 ( డిడి9వార్త):**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను పురస్కరించుకుని బీజేపీ అధిష్టానం పిలుపు మేరకు బేగంపేటలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సమాజ ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ప్రథమ శ్రేణి కార్మికులను గౌరవించుకోవాలన్న పార్టీ ఆదేశాలతో, బేగంపేట మోతీలాల్ నెహ్రూ నగర్ పార్కులో పలువురు జీహెచ్ఎంసీ కార్మికులను బీజేపీ రాష్ట్ర యువ నాయకులు మర్రి పురురవ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్మికులకు ప్రత్యేక కానుకలను అందజేసి వారి సేవలను కొనియాడారు.

సమాజంలో పరిశుభ్రతను కాపాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్మికుల సంక్షేమానికి తమ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. వారం రోజుల పాటు సాగే ఈ సేవా కార్యక్రమాల్లో భాగంగా కార్మికుల సేవలను గుర్తించి వారిని ప్రోత్సహించడం అభినందనీయమని ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బేగంపేట బీజేపీ డివిజన్ అధ్యక్షులు ఎం. మహేష్ కుమార్ ముదిరాజ్, మహిళా మోర్చా నాయకురాలు సంధ్య లక్ష్మి, డివిజన్ ప్రధాన కార్యదర్శి బాబురావుతో పాటు పార్టీ నాయకులు టి. వెంకటేష్ యాదవ్, ఆర్. సంతోష్, ప్రమోద్, లోహిత్ పాల్గొన్నారు.



## ఘనంగా గ్రాడ్యుయేషన్ సెలబ్రేషన్ ఎంపీపీఎస్ రేణుక నగర్ స్కూల్ లో!!

**సిద్దిపేట ఏప్రిల్22 (డిడి9వార్త)**

ఎంపీపీఎస్ రేణుక నగర్ స్కూల్ లో బుధవారం గ్రాడ్యుయేషన్ సెలబ్రేషన్ వేడుకలు ఘనంగా జరిగాయి విద్యార్థులకు పట్టా ప్రదానం: తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు 'గ్రాడ్యుయేషన్ పట్టాలు' అందజేశారు.సాంస్కృతిక కార్యక్రమాలు: విద్యార్థులచే నృత్యాలు, ఆటపాటలు.ఉపాధ్యాయుల/ అతిథుల ప్రసంగాలు: విద్యార్థులను అభినందించారు.




## నర్సాపూర్‌లో విద్యార్థుల ఆరోగ్యానికి ముందడుగు

- **అంబెడ్కర్ కమిటీ సభ్యులు పాఠశాల కు వాటర్ ప్యూరిఫైయర్ పంపిణీ..**

**సిద్దిపేట ఏప్రిల్22 (డిడి9వార్త)**

సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలోని రెండవ వార్డ్ నర్సాపూర్‌లో అంబేద్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఒక సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీ యుపిఎస్ నర్సాపూర్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శుద్ధమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో 200 లీటర్ల సామర్థ్యం గల ఆధునిక వాటర్ ప్యూరిఫైయర్‌ను కమిటీ సభ్యులు పాఠశాలకు అందజేశారు.ఈ కార్యక్రమానికి ఎంఈఓ రాజ ప్రభాకర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందానికి ప్యూరిఫైయర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ ఇటువంటి



కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. శుద్ధమైన తాగునీరు అందుబాటులో ఉంటే విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా వారి విద్యాభ్యాసంపై కూడా మంచి ప్రభావం ఉంటుందని తెలిపారు.విద్యార్థులకు శుభ్రమైన తాగునీరు అందించడం ద్వారా వారి ఆరోగ్య రక్షణకు తోడ్పడటం కమిటీ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నాయన చంద్రం పాల్గొని కమిటీ సభ్యుల సేవాభావాన్ని కొనియాడారు. కమిటీ అధ్యక్షుడు మోత్కూరు శివప్రసాద్ గారు మాట్లాడుతూ, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా చేపడతామని అన్నారు. అలాగే సభ్యులు కోరే ఎల్లయ్య, బండారి నరసింహులు, బెల్ల రాములు, రాజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సాయన్న కుటుంబంలో మరో విషాదం..

- **సతీమణి గీత కన్నుమూత**

**సికింద్రాబాద్,ఏప్రిల్ 22 ( డిడి9వార్త):**

కంటోన్మెంట్ దివంగత ఎమ్మెల్యే సాయన్న కుటుంబంలో మరో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సాయన్న సతీమణి జ్ఞాని గీత (68) బుధవారం ఉదయం సికింద్రాబాద్‌లోని కిమ్స్ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్యం కాస్త మెరుగుపడటంతో డిశ్చార్జ్అయ్యేందుకు సిద్ధమవుతున్న తరుణంలో, ఒక్కసారిగా కార్డియాక్అరెస్ట్‌కావడంతో ఆమె కన్నుమూశారు. గీత గతంలో ఏపీ స్టేట్ కో ఆపరేటివ్ బ్యాంకులో లీగల్ ఆఫీసర్‌గా సుదీర్ఘ కాలం సేవలందించి పదవీ విరమణ చేశారు. సాయన్న, గీత దంపతులకు ముగ్గురు కుమార్తెలు నమ్రత, నివేదిత, లాస్య నందిత.

గీత భౌతికకాయాన్ని అశోక్‌నగర్‌లోని ఆమె స్వగృహానికి తరలించగా పలువురు రాజకీయ ప్రముఖులు నివాళులర్పించారు. టీఎస్‌బీసీఎల్‌మాజీ చైర్మన్ గజ్జల నగేష్, మాజీ బోర్డు సభ్యులు పాండు యాదవ్, నలిని కిరణ్, అనిత ప్రభాకర్, రావుల సతీష్‌కుమార్, అనిల్‌తదితరులు సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గురువారం ఉదయం 11 గంటలకు వెస్ట్‌మారేడుపల్లిలోని హిందూ శ్మశానవాటికలో ఆమె అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు.



**నాలుగేళ్లలో ముగ్గురి మృతి..**

**కంటోన్మెంట్‌లో విషాదం**

సౌమ్యుడిగా, వివాదరహితుడిగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన సీనియర్ దళిత నేత సాయన్న మరణం నుంచి ఆ కుటుంబం ఇంకా కోలుకోకముందే వరుస విషాదాలు వెంటాడుతున్నాయి. 2023 ఫిబ్రవరిలో సాయన్న కన్నుమూయగా, తండ్రి వారసురాలిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన కుమార్తె లాస్య నందిత 2024 ఫిబ్రవరిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మరణించారు. తాజాగా సాయన్న సతీమణి గీత కూడా మృతి చెందడంతో కంటోన్మెంట్ నియోజకవర్గంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కేవలం నాలుగేళ్ల వ్యవధిలోనే ఒకే కుటుంబంలో ముగ్గురు ముఖ్యులు మరణించడం పట్ల స్థానికులు, అభిమానులు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు

## ధర్మం, న్యాయం ఎప్పటికైనా విజయం అవుతుంది...

- **నేడు హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వం కు చెంపపెట్టు...**
- **బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణ శర్మ...**



న్యాయం గా ధర్మం గా ఉన్న వారి పై ఎప్పుడు విజయం వరిస్తుందని మరో సారి నిరూపితమైందని బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ అన్నారు.. కాళేశ్వరం ప్రాజెక్టు పై గోష్ కమిటీ కెసిఆర్, హరీష్ రావు ల పై ఎలాంటి చర్యలు తీసుకోవద్దు అని హైకోర్టు ఇచ్చిన తీర్పు పై ఆయన హర్షం వ్యక్తం చేశారు.. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ కు జీవధార, ప్రాణదార అని అందుకే ధర్మ బద్దులు వైపే సత్యం, ధర్మం ,న్యాయం ఉంటుందని మరో సారి నిరూపితం అయిందన్నారు.. కేవలం రాజకీయ కక్ష మాత్రమేనని అన్నారు..తన తప్పులను ప్రశ్నించే వారి మీద బురద చల్లి అందరూ తన లాంటి వాళ్లేనని చెప్పే ప్రయత్నంలో భాగమే ఈ కాళేశ్వరం తప్పుడు కేసు, పీసీ ఘోష్ కమిషన్ వేసి న్యాయబద్ధత చట్టబద్ధతలేని తప్పుడు పద్ధతిలో విచారణ జరిపి ఎన్నికల సందర్భంలో ప్రజల్లోకి వెళ్లి తను ఇచ్చిన హామీలను తను అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ఏవి లేనందున కేవలం గత ప్రభుత్వం మీద నిందారోపణలు చేసి దుష్ప్రచారం చేసి ఎన్నికలు వచ్చినప్పుడల్లా గ్రామపంచాయతీ ఎన్నికలప్పుడు, పార్లమెంటు ఎన్నికలప్పుడు మళ్లీ ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయి అని తెలిసి అటెన్షన్ డైవర్షన్ చేసే ఏకైక విధానాన్ని గత రెండున్నర సంవత్సరాలుగా అమలు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నాడు, వీటన్నిటికీ చెంపపెట్టు లాంటి తీర్పే నేటి హైకోర్టు ఉత్తర్వులన్నారు.. ఇకనైనా రేవంత్ తప్పుడు ఆరోపణలు చేయడం, దుర్భాషలాడడం, కమిషన్ల పేరుతో కాలమెల్ల తీయడం మానుకొని, ఇచ్చిన హామీల అమలు కోసం ఏదో మేరకు ప్రయత్నం చేయాలని ఇకనుంచయినా వంచన, నయవంచన పాలనకు స్వస్తి పలికి, ప్రజాపాలన కు శ్రీకారం చుట్టాలని, లేనిఎడలా రానున్న రోజుల్లో ప్రజల నుంచి వస్తున్నటువంటి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కొక తప్పదని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం

**కౌడిపల్లి డిడి9వార్త :-**

మండల పరిధిలోని కన్నారం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఉపాసన రాణి రామచందర్ మరియు మహమ్మద్ నగర్ లో కుమ్మరి యాదమ్మ నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను బుధవారం రోజున ఎంపీడీవో శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రారంభించారు ఈ కార్యక్రమంలో కన్నారం సర్పంచ్ రాములు, మహమ్మద్ నగర్ సర్పంచ్ రవికుమార్ యాదవ్ ఉపసర్పంచులు అనిల్ కుమార్ పోచయ్య మహమ్మద్ నగర్ మాజీ ఉపసర్పంచ్ ఫారూఖ్ ప్రముఖులు బాలా గౌడ్ రఘు కృష్ణ పంచాయతీ సెక్రెటరీ వార్డు మెంబర్లు తదితరులు ఉన్నారు.



## దళారులను నమ్మి మోసపోవద్దు

- **ధాన్యం కొనుగోలు కేంద్రాల ను ప్రారంభించిన ఎమ్మెల్యే**

**కౌడిపల్లి డిడి9వార్త:-**

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు బుధవారం మండల పరిధిలోని పలు గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన ఆఖరి ధాన్యం గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి 2389 రూపాయలు బి గ్రేడ్ ధాన్యానికి 2369 రూపాయలు ఇస్తుందని వారు తెలిపారు అంతేకాకుండా ధాన్యం బస్తాలు తరలించడానికి లారీలను ప్రభుత్వం సమకూర్చాలని అన్నారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్, మహమ్మద్ నగర్ సొసైటీ సీఈవో దుర్గాగౌడ్, మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సారా రామా గౌడ్, సర్పంచులు శివానందరెడ్డి కుమ్మరి శివలీల, కుమార్, పద్మ, స్వప్న,నాయకులు బొడ్ల నవీన్, పోలా నవీన్, సంతోష్ గౌడ్, గుంజరి ప్రవీణ్, కాంతారావు,ఎల్లం, రామాంజనేయులు, రాజు, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.




## స్నేహితుడి పై దాడి చేసి హత్య...

- **ఇద్దరికీ జీవిత ఖైదు, 30 వేల జరిమానా....**
- **శిక్ష పడేందుకు కృషి చేసిన సిబ్బందిని అభినందించిన ఎస్పీ...**

**మెదక్ ఏప్రిల్ 22 (డిడి9వార్త)**

మెదక్ జిల్లా రామాయంపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన స్నేహితుడి హత్య కేసులో ఇద్దరు నిందితులకు జిల్లా న్యాయస్థానం జీవిత ఖైదు తో పాటు చెరో 15 వేల చొప్పున జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు. పూర్తి వివరాలు వెల్లడిస్తూ డి. ధర్మారం గ్రామానికి చెందిన నరేందర్ తన స్నేహితులైన పిట్ల పరుశురాములు, చెవిటోల్ల చంద్రంతో కలిసి తరచూ మద్యం సేవించేవాడు. ఈ క్రమంలో వారి మధ్య తలెత్తిన విభేదాలు తీవ్రమై, క్షణిక ఆవేశంలో నిందితులు నరేందర్ పై దాడి చేసి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని చెక్ డ్యాంలో పడేసి ఘటనను దాచి పెట్టేందుకు ప్రయత్నించారు. ఈ ఘటన 2022 మే 4 న వెలుగులోకి రావడంతో రామాయంపేట్ పోలీస్ స్టేషన్‌లో అప్పటి ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేశారు. దర్యాప్తు అధికారి చంద్రశేఖర్ రెడ్డి సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరించి, సాక్షులను విచారించి నిందితులను అరెస్ట్ చేశారు. తదనంతరం పూర్తి స్థాయి దర్యాప్తు నిర్వహించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత ఐఓ వెంకట రాజా గౌడ్ సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ వాదనలు వినిపించారు. సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా న్యాయమూర్తి నీలిమ నిందితులు నేరం చేసినట్లు నిర్ధారించి ఇద్దరికీ జీవిత ఖైదు తో పాటు చెరో 15 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్పీ




తెలిపారు.ఈ కేసులో కోర్ట్ లైజనింగ్ ఆఫీసర్ ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ భూపాల్ సహకరించారు. నిందితులకు శిక్ష పడేందుకు కృషి చేసిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## ఎన్టీఆర్ తుపాన్ ఎప్పుడంటే..?

అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్ సినిమా ఈ ఏడాది జూన్‌లో వస్తుందనుకుంటే... అది కాస్త వచ్చే సంవత్సరానికి వాయిదా పడింది. ఆ విషయాన్ని నిర్మాణ సంస్థలు మంగళవారం అధికారికంగా ప్రకటించాయి. ఎన్టీఆర్ కొత్త సినిమా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న సంగతి తెలిసిందే. టీ సిరీస్‌తో కలిసి మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు రూపొందిస్తున్నాయి. నందమూరి కల్యాణ్‌రామ్, నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్నారు. 2024లో ప్రారంభమైన ఈ సినిమా చిత్రీకరణ అనుకున్నంత వేగంగా ముందుకు సాగలేదు. దాంతో ఎప్పటికప్పుడు విడుదల ప్రణాళికలు మారుతూ వచ్చాయి. వచ్చే ఏడాది జూన్ 11న సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టుగా ప్రకటిస్తూ, నిర్మాణ సంస్థలు మంగళవారం ఓ కొత్త పోస్టర్‌ని విడుదల చేశాయి. 'తుపాను తన లక్ష్యాన్ని కనుక్కున్నప్పుడు...' అంటూ నిర్మాణ సంస్థలతోపాటు, 'తన పాలన, తన నేల...' అనే వ్యాఖ్యని జోడిస్తూ కథానాయకుడు ఎన్టీఆర్ ఆ పోస్టర్‌ని సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ఎన్టీఆర్ పుట్టినరోజుని పురస్కరించుకుని ఈ ఏడాది మే 20న ప్రచార చిత్రాన్ని విడుదల చేయనున్నారు. 'సలార్' తర్వాత ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాకి 'డ్రాగన్' అనే పేరు ప్రచారంలో ఉంది. చిత్రబృందం మాత్రం సినిమా పేరుని ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. పాన్ ఇండియా స్థాయిలో యాక్షన్, భావోద్వేగాల మేళవింపుగా రూపొందుతున్న ఈ సినిమా తెలుగుతోపాటు తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ఎన్టీఆర్ శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్, ఛాయాగ్రహణం: భువన్‌గౌడ, ప్రొడక్షన్ డిజైన్: చలపతి.



## రైతుల జీవిత కథతో ఫీచర్ ఫిల్మ్ షూటింగ్ ప్రారంభం



రైతుల జీవితాలను ప్రతిబింబించే కథాంశంతో రూపొందుతున్న 'ఫ్యూచర్ ఫిల్మ్' చిత్రీకరణ గుంటూరుకు సమీపంలోని వింజనంపాడు గ్రామంలో ఘనంగా ప్రారంభమైంది. రైతుల జీవితం, వారు ఎదుర్కొనే కష్టాలు, సాధించే విజయాలు, అలాగే సమాజం రైతులకు ఎలా చేయూతనివ్వాలనే అంశాలను ప్రధానంగా తీసుకుని ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు చిత్ర దర్శకుడు సుధాకరరెడ్డి టి. తెలిపారు. గ్రామీణ జీవన విధానం, రైతుల బాధలు, వారి ఆశలు, ఆవేదనలను వాస్తవికంగా చూపించడమే ఈ సినిమా ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. రైతు జీవితం కేవలం పంటలకే పరిమితం కాదని, అది కుటుంబం, సమాజం, ఆర్థిక వ్యవస్థతో ముడిపడి ఉన్న గొప్ప జీవన విధానమని ఈ చిత్రం ద్వారా తెలియజేయనున్నట్లు చెప్పారు. ఈ చిత్రానికి తొలి షెడ్యూల్‌ను గుంటూరు పరిసర ప్రాంతాల్లో, ముఖ్యంగా వింజనంపాడు గ్రామంలో చిత్రీకరిస్తుండగా, రెండో షెడ్యూల్‌ను విజయవాడ, అమరావతి ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు దర్శకుడు వెల్లడించారు. గ్రామీణ నేపథ్యంలో సహజత్వాన్ని ప్రతిబింబించేలా చిత్రీకరణ జరుపుతున్నామని, రైతుల జీవిత సత్యాలను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. తేజు ఫిలిమ్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రానికి ప్రముఖ అగ్రో కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్ రావు బాల్గురి నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. వ్యవసాయం, రైతుల సమస్యలపై అవగాహన కలిగించే కథను తెరపైకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు నిర్మాత పేర్కొన్నారు. రైతుల కష్టాలను సమాజానికి తెలియజేసే బాధ్యత సినిమా రంగానిదని భావించి ఈ ప్రాజెక్టును ప్రారంభించినట్లు చెప్పారు. ఈ చిత్రానికి జగపతి శ్రీనివాస్ మాటలు అందిస్తుండగా, దాసరి రవికుమార్ కెమెరామెన్ మరియు ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సహ నిర్మాతగా రాజశేఖర్ రెడ్డి డి. వ్యవహరిస్తున్నారు. ప్రచార బాధ్యతలను ఎస్.ఏ.టి. శ్రీధర్ పీఆర్‌వోగా నిర్వహిస్తున్నారు. బాబాయ్ మీడియా ఈ చిత్రానికి మీడియా భాగస్వామిగా వ్యవహరిస్తోంది.

దర్శకుడు సుధాకరరెడ్డి మాట్లాడుతూ, రైతుల జీవితం ఆధారంగా ఇప్పటికే అనేక కథలు వచ్చినప్పటికీ, ఈ చిత్రం ప్రత్యేక సందేశంతో రూపొందుతుందని చెప్పారు. రైతు కేవలం అన్నదాత మాత్రమే కాదు, సమాజానికి వెన్నెముక అని తెలియజేసేలా కథను తీర్చిదిద్దామని పేర్కొన్నారు. రైతులు ఎదుర్కొనే సమస్యలు, వారి జీవితాల్లోని భావోద్వేగాలు, కుటుంబ పరిస్థితులు, విజయాలు ఇలాంటి అన్నీ అంశాలను ప్రేక్షకుల హృదయాలకు హత్తుకునేలా చూపించనున్నట్లు తెలిపారు. చిత్రబృందం త్వరలోనే షూటింగ్ పూర్తి చేసి సినిమాను విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ఈ చిత్రం రైతుల పట్ల సమాజంలో మరింత గౌరవ భావన పెంపొందించడమే కాకుండా, రైతులకు చేయూత ఇవ్వాలనే ఆలోచనను ప్రజల్లో కలిగిస్తుందని దర్శకుడు ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ 'ఫ్యూచర్ ఫిల్మ్' ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదిస్తుందని చిత్రబృందం నమ్మకంగా ఉంది. రైతుల జీవితాలపై సందేశాత్మకంగా రూపొందుతున్న ఈ సినిమా ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటుందని, సమాజానికి ఒక మంచి సందేశాన్ని అందిస్తుందని వారు భావిస్తున్నారు.

## హాయ్ చెప్పండి... మీకు ఇష్టమైన పాటకి

అగ్ర కథానాయిక నయనతార, తమిళ నటుడు కవిన్ ప్రధాన పాత్రల్లో రూపొందుతున్న చిత్రం 'హాయ్'. ఈ ఫీల్ గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌కి విష్ణు ఎడవన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఉమేశ్ కుమార్ బన్సాల్, విఘ్నేశ్ శివన్, నయనతార, ఎస్.ఎస్ లలిత్ కుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమాలో మొదటి పాట 'కన్నకుళియ'ని 'మీ ఫేవరేట్ సాంగ్‌కి హాయ్ చెప్పండ'నే వ్యాఖ్యలతో సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్ర బృందం. పెళ్లి నేపథ్యంలో ఈ గీతం ఆత్మీయుల సందడితో సరదాగా సాగుతోంది. ఈ పాటలో సంప్రదాయ దుస్తుల్లో నయనతార కనిపించిన తీరు ఆకట్టుకునేలా ఉంది. ఈ గీతానికి దర్శకుడు విష్ణు సాహిత్యమందించగా జీవీ ప్రకాశ్ కుమార్ ఆలపించారు. జెన్ మార్టిన్ స్వరపరిచారు. ఈ చిత్రంలో రాధికా శరత్ కుమార్, భాగ్యరాజ్ తదితరులు నటిస్తున్నారు.



## చరణ్ 'పెద్ది'లో శృతి హాసన్ ..

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం 'పెద్ది' సినిమా షూటింగ్‌ను శరవేగంగా ముగించే పనిలో ఉన్నారు. 'ఉప్పెన' డైరెక్టర్ బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాపై అంచనాలు ఇప్పటికే పీక్స్‌లో ఉన్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి ఒక అదిరిపోయే గాసిప్ బయటకు వచ్చింది. ఏంటంటే ఈ చిత్రంలో వచ్చే ఒక స్పెషల్ సాంగ్ కోసం ఇప్పటికే చాలా మంది హీరోయిన్ల పేర్లు వినపడగా.. తాజాగా గ్లామర్ డాల్
శృతి హాసన్‌ను ఎంపిక చేసినట్లు సమాచారం. ఇప్పటికే రామ్ చరణ్ - శృతి హాసన్ 'ఎవడు' సినిమాలో జంటగా నటించారు.. ఇందులో 'పింపుల్ డింపుల్' పాటలో వీరిద్దరి కెమిస్ట్రీ, డ్యాన్స్ మూవ్స్ థియేటర్లను ఊపేశాయి. ఇప్పుడు చాలా కాలం తర్వాత 'పెద్ది' కోసం ఈ హిట్ జోడీ మళ్ళీ కలుస్తుండటం విశేషం. ఇప్పటికే ఈ సాంగ్ కోసం పలువురు హీరోయిన్ల పేర్లు (సమ్యుక్త మీనన్ వంటి వారు) వినిపించినా, చివరికి శృతి హాసన్ వైపే మేకర్స్ మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. ఇక ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్



సంగీతం అందిస్తుండటం మరో విషయం. సాధారణంగా రెహమాన్ ఇచ్చే మెలోడీలే కాకుండా, ఆయన ఇచ్చే ఫోక్ లేదా మాస్ బీట్స్ కూడా చాలా పవర్ ఫుల్ గా ఉంటాయి. ఇప్పుడు శృతి హాసన్ కోసం ఆయన ఒక అదిరిపోయే ట్యూన్ సిద్ధం చేశారని, ఈ పాటలో చరణ్ - శృతి కలిసి చేసే డ్యాన్స్ 'పెద్ది' సినిమాకే మేజర్ హైలైట్ అవుతుందని టాక్. దీని గురించి అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది.

## 'కరుప్పు' ఆడియో లాంచ్ డేట్ ఫిక్స్..

కోలీవుడ్ స్టార్ నటుడు సూర్య ప్రస్తుతం ఆర్జే బాలాజీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'కరుప్పు' అనే చిత్రంలో హీరోగా నటిస్తున్నాడు. ఇందులో త్రిష హీరోయిన్‌గా కనిపించబోతోంది. ఈ సినిమాను మే 14వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనున్నారు. తమిళ్‌తో పాటు తెలుగులో కూడా ఈ సినిమాను ఏకకాలంలో విడుదల చేయబోతున్నారు. తెలుగులో ఈ చిత్రాన్ని 'వీరభద్రుడు' అనే టైటిల్‌తో రిలీజ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో, తాజాగా మూవీ బృందం ఆడియో లాంచ్ కార్యక్రమానికి సంబంధించిన ప్రకటనను విడుదల చేసింది.



ఈ చిత్ర ఆడియో లాంచ్ కార్యక్రమాన్ని ఏప్రిల్ 26వ తేదీన మధురై లోని సోలమలై పాలిటెక్నిక్ కాలేజ్‌లో నిర్వహించనున్నట్లు అధికారికంగా వెల్లడించింది. ఇప్పటివరకు ఈ సినిమా నుంచి విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. దీంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో యోగి బాబు, ఇంద్రన్స్, నట్టి సుబ్రమణియం (నట్టి), స్వాసిక, శివాడ, సుప్రీత్ రెడ్డి తదితరులు ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాకు సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నాడు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్.ఆర్. ప్రకాష్‌బాబు మరియు ఎస్.ఆర్. ప్రభు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



## మత్తెక్కించే చూపులతో హీట్ పెంచుతున్న రవితేజ హీరోయిన్

అందాల ముద్దుగుమ్మ రజిషా విజయన్ 2016లో అనురాగ కరిక్కిన్ వెల్లం అనే మలయాళ చిత్రంతో వెండితెరకు పరిచయం అయింది. ఈమె మాస్ మహారాజా రవితేజ హీరోగా రూపొందిన రామారావు ఆన్ డ్యూటీ చిత్రంతో టాలీవుడ్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది.

ఈ సినిమా ఫ్లాప్ కావడంతో ఈ సినిమా ద్వారా ఈమెకు తెలుగులో పెద్దగా గుర్తింపు రాలేదు. కొంతకాలం క్రితం ఈ బ్యూటీ కార్తీ హీరోగా రూపొందిన సర్దార్ చిత్రంలో హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమా మంచి విజయం సాధించడంతో తమిళ సినీ పరిశ్రమలో ఈ నటికి మంచి గుర్తింపు వచ్చింది.

సినిమాల్లో అప్పుడప్పుడు తన అందాలతో ఆకట్టుకుంటున్న ఈ బ్యూటీ సోషల్ మీడియాలో మాత్రం కాస్త ఎక్కువగానే తన అందాలను ప్రదర్శిస్తోంది. తాజాగా ఈ బ్యూటీకి సంబంధించిన కొన్ని ఫోటోలు వైరల్‌గా మారాయి.

అందులో ఈమె సూపర్ సాలిడ్ హాట్ లుక్‌లో స్లీవ్‌లెస్ డ్రెస్ ధరించి, తన ఎద మరియు బ్యాక్ అందాలు ప్రదర్శితమయ్యేలా స్టైలిష్ మరియు కిల్లింగ్ లుక్‌లో ఫోటోలకు ఫోజులు ఇచ్చింది.

ఇందులో ఈమె చెవులకు పెట్టుకున్న చెవి దిద్దులు, అలాగే నల్లటి కురులు ఈ నటి అందాన్ని మరింతగా పెంచాయి. ఈ ఫోటోలలో ఈమె చాలా హాట్ లుక్‌లో కనిపించడంతో ఈ ఫోటోలు పెద్ద ఎత్తున వైరల్ అవుతున్నాయి.

## కొత్తింటికి అల్లు అర్జున్?

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన కలల సౌధాన్ని అత్యంత విలాసవంతంగా తీర్చిదిద్దుకుంటున్నారు. జూబ్లీహిల్స్‌లో మెగాస్టార్ చిరంజీవి నివాసానికి అతి సమీపంలోనే ఈ కొత్త మేన్షన్ రూపుదిద్దుకోవడం విశేషం. తాజాగా అందుతున్న సమాచారం మేరకు మెగాస్టార్ చిరంజీవి ఇంటికి కూతవేటు దూరంలోనే అల్లు అర్జున్ తన నూతన గృహాన్ని నిర్మిస్తున్నారు. దాదాపు 4 వేల చదరపు గజాల సువిశాల విస్తీర్ణంలో ఈ మేన్షన్ నిర్మాణం జరుగుతోంది. అత్యాధునిక హంగులు, గ్లోబల్ డిజైన్‌తో నిర్మిస్తున్న ఈ ఇంటి కోసం బన్నీ సుమారు 100 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం.

గత కొద్ది రోజులుగా అల్లు అర్జున్ తన ఫ్యామిలీతో కలిసి ముంబైకి మకాం మారుస్తున్నారనే ప్రచారం జోరుగా సాగింది. అయితే, ఇందులో పూర్తి నిజం లేదని తెలుస్తోంది. ప్రస్తుతం తండ్రి అల్లు అరవింద్‌తో కలిసి ఉంటున్న బన్నీ, కేవలం తన అప్ కమింగ్ మూవీ 'రాకా' షూటింగ్ షెడ్యూల్స్ కోసం మాత్రమే ముంబైలో ఉండనున్నారని సమాచారం. అది కేవలం తాత్కాలికమే తప్ప, శాశ్వతంగా అక్కడికి వెళ్లడం లేదని సన్నిహిత వర్గాల టాక్. ఇక మరో పక్క బన్నీ విలాసవంతమైన భవన నిర్మాణ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. అన్ని పనులు పూర్తి చేసి, ఈ ఏడాది చివరి నాటికి అల్లు అర్జున్ తన కుటుంబంతో కలిసి ఈ కొత్త ఇంట్లోకి అడుగుపెట్టాలని ప్లాన్ చేస్తున్నారు. టాలీవుడ్‌లోనే వన్ ఆఫ్ ది మోస్ట్ లగ్జరీ హౌస్‌గా నిలవబోతున్న ఈ మేన్షన్, గృహప్రవేశం తర్వాత అభిమానుల్లో మరింత ఆసక్తిని రేకెత్తించడం ఖాయం.



## ప్రేమకు వెలకట్టిన ప్రేయసి

'నా ప్రేమ వెలకట్టలేనిద'ని ఎన్నో ప్రేమ జంటలు మాట్లాడుకుంటుంటాయి. కానీ ఇక్కడ అమ్మాయి తన ప్రియుడి ప్రేమను కొనుక్కున్నానని అంటోంది. మరి ఆమె మాటల వెనుక అర్థమేంటో తెలుసుకోవాలంటే 'యే ప్రేమ్ మోల్ లియా' చిత్రం చూడాల్సిందే. బాలీవుడ్ కథానాయకుడు ఆయుష్మాన్ ఖురానా, శార్వరీ వాఘ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. సూరజ్ బర్జాత్యా దర్శకత్వం వహిస్తున్నారు. రాజశ్రీ ప్రొడక్షన్స్, మహావీర్ జైన్ ఫిల్మ్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. తాజాగా ఈ సినిమా ఈ ఏడాది నవంబరు 27న రాబోతున్నట్లు అధికారికంగా ప్రకటిస్తూ... సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టింది చిత్రబృందం. దీన్నొక భారీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లా తీర్చిదిద్దుతున్నారని, ఇందులో శార్వరి, ఆయుష్మాన్‌ల ప్రేమ ప్రయాణం, వారిద్దరి మధ్య కెమిస్ట్రీ సినీప్రియుల్ని ఆకట్టుకునేలా ఉంటుందని చిత్ర వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం శార్వరి ఖాతాలో 'ఆల్ఫా', ఆయుష్మాన్ జాబితాలో 'పతి పత్నీ ఔర్ వో దో', 'ఉడ్తా తీర్' లాంటి తదితర చిత్రాలున్నాయి.

